క్లుప్తంగా

పదోన్నతులు చేపట్టాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో.. ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వడం వల్ల మరిన్ని ఖాళీలు ఏర్పాడతాయని టీపీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మరికంటి బాల్‌రాజ్, విజయ భూషన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2010 కంటే ముందు విధుల్లో చేరిన వారికి టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు.

పూజా సామగ్రి వితరణ

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని రామస్వామి గుట్ట రామలింగేశ్వరస్వామి ఆలయానికి శుక్రవారం నేను సైతం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు డి.ప్రవీణ్‌కుమార్ నిత్య పూజ కోసం సామగ్రి అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ నరేందర్‌సాగర్, అశోక్‌రెడ్డి, రామస్వామి, శెట్టిశ్రవన్, బ్రిక్స్ పాష తదితరులు ఉన్నారు.

ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న టిప్పరు పట్టివేత

మిడ్జిల్: ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న ఇసుక టిప్పర్‌ను తహసీల్దార్ రాజునాయక్ పట్టుకున్నారు. అయ్యవారిపల్లి నుంచి మహబూబ్‌నగర్ మెడికల్ కాలేజీకి ఇసుక రవాణకు టీఎస్ఎండీసీ అనుమతి నేపథ్యంలో.. ఒక టిప్పరులో ఓవర్ లోడ్ వెనుకోని వెళ్తుండగా గుర్తించారు. టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శనివారం పరిశీలించిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

6న టెంకాయల వేలం

అడ్డాకుల: మండలంలోని కందూర్ రామలింగేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 6న టెంకాయలు, లడ్డూ, పులిహోర, తలనీలాలకు బహిరంగ వేలం నిర్వహించనున్నారు. వేలంలో పాల్గొనే వారు టెంకాయల కోసం రూ.50వేలు, లడ్డూ, పులిహోర కోసం రూ.50వేలు, తలనీలాలు, కొబ్బరి చిప్పల పోగుకు ఒక్కోదానికి రూ.10వేల చొప్పున డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలని నిర్వాహకులు సూచించారు. ఈ ఏడాది మార్చి 9 నుంచి 2025 ఫిబ్రవరి 26 వరకు విక్రయాలు కొనసాగించొచ్చని తెలిపారు.

ఉమ్రా యాత్రికుడికి ఘనసన్మానం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రానికి చెందిన జామీయ మజీద్ మేనేజింగ్ కమిటీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ జకీ ఉమ్రాయాత్ర వెళ్తుతున్న సందర్భంగా శుక్రవారం జామీయ మజీద్‌లో పలువురు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మౌలానా సఫీర్ అహ్మద్, మౌలానా మొహిసిన్‌పాష ఖాద్రీ, మజీద్ మేనేజింగ్ కమిటీ అధ్యక్షుడు అహ్మద్ సనా, కోశాధికారి మహ్మద్ ఇసాక్, సభ్యులు పాల్గొన్నారు.

యాత్రను విజయవంతం చేయాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి ఈనెల 4 నుంచి మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో చేపట్టే న్యాయ్‌యాత్రను విజయవంతం చేయాలని నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం మహబూబ్‌నగర్ మండల, హన్వాడ మండలాల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌పీ వెంకటేశ్, సురేందర్‌రెడ్డి, సిరాజ్‌ఖాద్రీ, నర్సింహారెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

మెటర్నిటీ ఆస్పత్రి అందుబాటులోకి తేవాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: వక్ఫ్ కాంప్లెక్స్ వెనుకలో గతంలో నిర్మాణం చేపట్టిన మెటర్నిటీ ఆస్పత్రి భవనాన్ని వెంటనే అందుబాటులోకి తేవాలని ఈమాన్ కమిటీ ఫౌండర్ ఎండీ. సలీం కోరారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం పలు ప్రజా, సామాజిక సంఘాలతో కలిసి మోటార్‌లైన్‌లోగల మెటర్నిటీ ఆస్పత్రిని పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సుల్తాన్, తఖీ, సయ్యద్ గౌస్, ఉమర్, కురుమూర్తి, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.


బహుమతుల ప్రదానం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: గత నెల 18న ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎస్సెస్సీ విద్యార్థులకు టాలెంట్ టెస్టు నిర్వహించగా.. ప్రతిభ కనబర్చిన వారికి జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బహుమతులను ప్రదానం చేశారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ ప్రతిభ, మధుసూదన్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. మొదటి బహుమతి రూ.10వేలు పంచవటి విద్యార్థి నందిని రెడ్డి, రెండో బహుమతి రెయిన్‌బో విద్యార్థి అందుకున్నారు. జేపీఎన్‌సీ చైర్మన్ రవికుమార్, జూనియర్ కళాశాలల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దీపాలంకరణోత్సవం

చిన్నచింతకుంట: అప్పంపల్లిలోని అబ్దుల్ రహిమాన్(మాసన్న) దర్గాలో శుక్రవారం రాత్రి దీపాలంకరణోత్సవం వైభవంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు స్వామివారి దర్శనానికి తరలివచ్చి దర్గాలో దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పూలు చాదర్లు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే బాణాసంచా కాల్చారు. కవ్వాలి, కీర్తనలను ఆలపించారు. భక్తులకు అన్నదానం చేశారు.

పెద్ద చెరువుకు సమస్యలు


వెన్నాచేడ్ పెద్ద చెరువు


పెద్ద తూముపైన పగుళ్లు

- ఏళ్లుగా మరమ్మతు కరువు
- లీకేజీల తూములు
- వృథాగా పోతున్న నీరు

గండేడ్: మండలపరిధిలోని పెద్దచెరువు ఏళ్లుగా మరమ్మతుకు నోచుకోవడంలేదు. దీంతో చెరువుకింద పంటలు సాగుచేసుకొంటున్న వివిధ గ్రామాల రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరు అందడం లేదని.. లీకేజీలతో నీరు వృథాగా పోతుండడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి తలెత్తుంతోందని వాపోతున్నారు. ఉమ్మడి మండల పరిధిలో సాలార్‌నగర్ ప్రాజెక్టుతో పాటు 11 నోటిఫైడ్ చెరువులు ఉన్నాయి. వీటితో పాటు 150 వరకు చిన్న చెరువులు కుంటలు ఉన్నాయి. వీటి పరిధిలో వేల ఎకరాలు సాగవుతున్నాయి. కాగా గండేడ్ మండలంలోనే వెన్నాచేడ్ చెరువు అన్నింటి కంటే పెద్దది. దీనికింద 475 ఎకరాల ఆయకట్టు అధికారికంగా నిర్దేశించారు. కానీ అనధికారికంగా దాదాపు వెయ్యి ఎకరాల వరకు సాగవుతుంది. జక్లపల్లి, లింగాయిపల్లి, జానంపల్లి, వెన్నాచేడ్ తదితర గ్రామాలకు చెందిన పంటపొలాలకు సాగునీరు అందుతుంది. దాదాపు రెండు వందల ఏళ్ల క్రితం నిర్మితమైన ఈ చెరువు ఏళ్ల తరబడి మరమ్మతుకు నోచుకోవడం లేదు. దీంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గి పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరందడం లేదు.

లీకవుతున్న తూములు

పెద్ద చెరువుకు రెండు తూములు ఉన్నాయి. రెండింటి నుంచీ నీరు లీకవుతోంది. చిన్న తూము గతంలో మరమ్మతు చేసినా తిరిగి అదే పరిస్థితి నెలకొంది. లీకేజీ ఎక్కడ ఉందో అధికారులు సైతం గుర్తించలేకపోయారు. అప్పట్లో షెట్టరు మార్చడంతో పాటు తూమును కూడ మరమ్మతు చేశారు. అయినా పరిస్థితిలో ఏమార్పు లేదు. ఇక పెద్ద తూము నుంచి సైతం ఏటా నీరు లీకవుతోంది. రెండు తూముల నుంచి దాదాపు మూడు నాలుగు మోటార్ల నీరు వృథాగా పోతుందని రైతులు వాపోతున్నారు. తుకాలు కట్టక ముందే నీరు తగ్గిపోతోందని.. నాట్లు పడి పంట చివర వరకు నీరందక అవస్థలు పడుతున్నామని రైతులు చెబుతున్నారు.


చెరువుకింద సాగయిన వరి

మరమ్మతుకు నోచుకోని కాల్వలు

రెండు తూముల కింద ఉన్న కాల్వలు మరమ్మతుకు నోచుకోవడం లేదు. ప్రతి ఏటా సాగు సమయంలో రైతులు అందరు కలిసి జేసీబీ సాయంతో చర్యలు చేపట్టి.. నీరు పారబెట్టుకోవడం తప్ప శాశ్వతంగా కాల్వల నిర్మాణం జరగలేదు. కాల్వలకు చాలా చోట్ల రంధ్రాలు పడి నీరంతా వాగులోకి వెళ్తోంది. గతంలో సీసీ కాల్వను కొద్దిదూరం మాత్రమే నిర్మించారు.

వీటికి తోడు

చెరువు కట్ట సైతం బలహీనంగా మారింది. కట్టపై కంపచెట్లు ఏపుగా పెరిగిపోయాయి. కట్టకు పటిష్టంగా లేకపోవడంతో తెగిపోయే ప్రమాదం కనిపిస్తోంది. గతంలో కట్టకు వెనుకవైపు పెద్ద రంధ్రం పడగా.. అప్పటి సర్పంచ్ మట్టి వేయించి పూడ్చించారు. ఎక్కువ మొత్తంలో వరదనీరు వస్తే సమస్య తప్పదని పలువురు వాపోతున్నారు. కాగా అప్పట్లో మండలంలో దాదాపుగా అన్ని చెరువులు, కుంటలకు మిషన్‌కాకతీయ కింద మరమ్మతు చేపట్టారు. కానీ పెద్ద చెరువు మాత్రం అందుకు నోచుకోలేకపోయింది. దీనికంటే ముందు వెన్నాచేడ్ పెద్దచెరువుకు సాలార్‌నగర్ ప్రాజెక్టు నుంచి ఫీడర్‌ఛానల్ మరమ్మతు చేసే పనిని పెట్టారు. దీని కారణంగా చెరువు మిషన్ కాకతీయ కింద ఎంపిక కాలేదు. ఛానల్ సైతం సరైన రీతిలో నిర్మించకపోవడం రెండు మూడు చోట్ల నీరంతా వృథా అవుతోంది. ఇప్పటికైన మరమ్మతు చేపట్టి పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరందేలా చూడాలని పలువురు రైతులు కోరుతున్నారు.

సమస్య పరిష్కరించాలి

ఐసీఐసీ ఫౌండేషన్‌వారు చెరువును ఆధునీకికరించడానికి ముందుకు వచ్చారు. దీంతో మేం సంతోషపడ్డాం. పంచాయతీ తీర్మానం కూడా ఇచ్చాం. ఇందుకు ఇరిగేషన్ ఉన్నతాధికారులు అనుమతి ఇవ్వాలని ఫౌండేషన్ వారు కోరారు. వారు కూడా వచ్చి పరిశీలించారు. కాని అనుమతి ఇవ్వలేదు. మరమ్మతుకు అవకాశం లేకుండా పోయింది. ఇతర నిధులైనా కేటాయించి సమస్య పరిష్కరించాలి.
– పుల్లారెడ్డి, మాజీ సర్పంచ్, వెన్నాచేడ్

ఇబ్బందులు పడుతున్నాం

మా పొలాలు చివర్లో ఉన్నాయి. కాల్వలు సక్రమంగా లేవు. ఎక్కడ పడితే అక్కడ రంధ్రాలు పడుతున్నాయి. వాటిని మూయడం మావల్ల కావడం లేదు. ఒకచోట మూస్తే మరోచోట పడుతున్నాయి. ఏటా ఇబ్బందులు పడుతూనే ఉన్నాం. ఒక్కోసారి నీరందక పంటలు ఎండిన సందర్భాలు ఉన్నాయి. బోరు కూడా లేక చెరువు నీటిపైనే ఆధారపడుతున్నాం. కాల్వలు శాశ్వతంగా నిర్మిస్తే బాగుంటుంది.
– చిన్నయ్య, రైతు, లింగాయిపల్లి

నిధులు లేవు

చిన్న చిన్న పనులు అయితే డిపార్టుమెంటు తరపున చేపట్టే అవకాశం ఉంది. పెద్ద మొత్తంలో చెరువు మరమ్మతు చేయడానికి ప్రస్తుతం నిధులు లేవు. ఐసీఐసీ ఫౌండేషన్ వారు ముందుకు వస్తే పనులు చేపట్టేందుకు సహకారం అందిస్తాం. ఈవిషయాన్ని స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. ఇంకా ఏవైనా అవకాశాలు ఉంటే నిధులు కేటాయించేందుకు ప్రయత్నిస్తాం.
– వెంకట్‌రాములు, ఇరిగేషన్ డీఈఈ, చేవెళ్ల డివిజన్

నీటి వసతి లేకపోతే వరి వద్దు


నాగినోనిపల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ కృపాకర్‌రెడ్డి

హన్వాడ: ప్రస్తుత పరిస్థితుల్లో భూగర్భజలాలు పూర్తిగా అడుగంటిపోతున్నాయని.. నీటి వసతి ఉన్న రైతులు మాత్రమే వరి వేసుకోవాలని రైతు శిక్షణాకేంద్రం ఏఓ కృపాకర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం నాగినోనిపల్లి, ఇబ్రహీంబాద్ గ్రామాలను సందర్శించారు. వరి, కూరగాయల పంటలను పరిశీలించారు. కూరగాయల సాగుపై దృష్టిసారిస్తే ప్రయోజనమని సూచించారు. ఏఈఓ రమేష్, ఆయా గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల విషయంలో అప్రమత్తత అవసరం


సూచనలు చేస్తున్న అధికారులు

నవాబుపేట: రైతులు పంటలకు వచ్చే తెగుళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని వీర్‌షెట్టిపల్లిలో వరి, వేరుశనగ పంటలను మండల వ్యసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పంటలకు తాజాగా సీజనల్ ప్రకారం వచ్చే కాండం తొలుచు పురుగు, రంగు మార్పు పురుగులను మొతదట్లోనే గుర్తించి వాటికి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. వేసవి కాలం కావటం పైగా పంటలు తక్కువగా ఉండటంతో కొన్ని రకాల చీడ పీడలు పంటలను పాడుచేస్తాయని అందుకు రైతులు అప్రమత్తంగా ఉండి వెంటనే నివారణ చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో ఎరువుల దుకాణాలను వారు పరిశీలించి స్టాక్ రిజిస్టార్ తణిఖీ చేశారు. అనంతరం రైతులకు విక్రయించిన వివిధ రకాల ఎరువులకు చెందిన రికార్డులు పరిశీలించారు. మండల వ్యవసాయ అధికారి కృష్ణకిషోర్, తేజశ్విని, నవీన్ తదితరులు ఉన్నారు.

సమానత్వం చాటుకోవాలి


వారోత్సవాల్లో పాల్గొన్న మహిళలు

మహబూబ్‌నగర్ రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించి తమ సమానత్వం చాటుకోవాలని జిల్లా మిషన్ కోఆర్డినేటర్ అరుణ, సఖీ సెంటర్ అడ్మిన్ సౌజన్య అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మహబూబ్‌నగర్ పట్టణంలోని షాసాబ్‌గుట్ట, రామయ్య బౌలి ప్రాంతాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు మహిళలకు ఎన్నో సౌకర్యాలు కల్పిస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసీమ్ సుల్తానా, డాక్టర్ గౌతమి, డాక్టర్ రమ్య, హెల్త్ సూపర్వైజర్ వెంకటేష్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అమరుల సాక్షిగా వర్గీకరణ సాధిస్తాం


నివాళి అర్పిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరుల సాక్షిగా వర్గీకరణ సాధిస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు అన్నారు. శుక్రవారం స్థానిక తెలంగాణ చౌరస్తాలోఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, ఎంఈఎఫ్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మాదిగ అమర వీరులకు నివాళులు అర్పించారు. నాయకులు పోలే బాలయ్య, బాలరాజు, ఖాదరయ్య, వినోద్‌కుమార్, కొండయ్య, శ్రీనివాసులు, బాలనాగయ్య, కమలాకర్, గణేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్: ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అమరులైన వారి సంస్మరణ కార్యక్రమాన్ని శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనం వద్ద నిర్వహించారు. వారి చిత్రపటాలను నివాళి అర్పించారు. ఉమ్మడి జిల్లా ఎమ్మార్పీఎస్ కన్వీనర్ జంగయ్య, సురేష్, బాలయ్య, గణేష్, కృష్ణ, శేఖర్, పరుశ రాము, లాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణ సాధించడమే అమరులకు నిజమైన నివాళి అని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కార్తిక్ పేర్కొన్నారు. ఈమేరకు పీయూ గేట్ వద్ద మాదిగ అమరుల సంస్మరణ కార్యక్రమం ఏర్పాటు చేసి, నివాళి అర్పించారు. నాయకులు కమలాకర్, రాము, గణేష్, మహానంది, శ్రీను పాల్గొన్నారు.

రామయ్యను దర్శించుకోండి



పాలమూరు: రెండో విడత అయోధ్య రామ మందిరం దర్శన యాత్ర రైలు గద్వాల నుంచి ప్రారంభం అవుతున్న క్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని స్టేషన్‌లో శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నేతలు ఏపీ మిథున్‌రెడ్డి, కొండ ప్రశాంత్‌రెడ్డిలు ప్రారంభించారు. పాలమూరు నుంచి అధిక సంఖ్యలో రామభక్తులు అయోధ్యకు తరలివెళ్లాలని సూచించారు. భక్తులు రైలు సదుపాయం సద్వినియోగం చేసుకోవాలని మిథున్‌రెడ్డి కోరారు.

మిత్రుడి కుటుంబానికి సాయం



పాలమూరు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆరె సంజీవ కుటుంబాన్ని ఆదుకొనేందుకు అతడితో పాటు పదోతరగతి(1994) చదువుకొన్న మిత్రులు ముందుకు వచ్చారు. అతడి భార్యకు రూ.36 వేల ఆర్థికసాయం శుక్రవారం అందించారు. సంజీవ కుటుంబాన్ని బీజేపీ నాయకులు ఏపీ మిథున్‌రెడ్డి, పాండురంగారెడ్డి, రాజుగౌడ్ తదితరులు పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. సహదేవ్, కె.నర్సింహులు, నరేష్ పాల్గొన్నారు. చౌదర్‌పల్లికి చెందిన సంజీవ ఇటీవల అప్పన్నపల్లి దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు.

ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించాలి



మహమ్మదాబాద్: ఆధ్యాత్మికత మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని వికారాబాద్ అలంపల్లి పీఠాధిపతి చిన్నబస్వ ప్రభుస్వామి అన్నారు. నంచర్లలో శివలింగ, వినాయక, పార్వతి విగ్రహాల ప్రతిష్ఠాపనకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా శివుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి ఆధ్యాత్మికత మానవాళికి మేలు చేస్తుందన్నారు. నిత్యం భగవన్నామస్మరణ, పండుగలతో ప్రజల్లో ఐక్యతాభావం పెరుగుతుందన్నారు. ఈసందర్భంగా గ్రామంలోని శివమాలాధారులు శ్రీశైలానికి బయలుదేరారు. ఎస్ఐ శేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కేఎం నారాయణ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

అలరించిన పద్య నాటకోత్సవాలు


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన నిర్వాహకులు


నాటకంలో ఓ సన్నివేశం

స్టేషన్ మహబూబ్‌నగర్: మన్యంకొండలో శ్రీమిత్ర కళానాట్య మండలి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన పౌరాణిక నాటక ప్రదర్శనలు అలరించాయి. చంద్రముఖి కల్చరల్ అకాడమీ విద్యార్థులచే నృత్య ప్రదర్శనలు, శ్రీరామాంజనేయ యుద్ధ ఘట్టం, మయసభ దుర్యోధన ఏకపాత్రాభినయం, శ్రీకృష్ణరాయబార నాటకం, కౌరవ సభ, కర్ణ రహస్యం, దేవేంద్రసభ నాటకాలను ప్రదర్శించారు. మండలి ప్రధాన కార్యదర్శి వి.నారాయణ శనివారం శ్రీకష్ణరాయబారం, మైరావణ పూర్తి నాటకం, మాయల పకీరు ఏకపాత్రాభినయం, గయోపాఖ్యాన యుద్ధం నాటక ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ధర్మకర్తల మండలి సభ్యులు సురేందర్, వెంకటాచారి, వనజ, సీనియర్ సంగీత కళాకారులు సూర్యవర్ధన్‌రెడ్డి, రాజబాబు, ఎస్ఆర్ఎర్ ట్రస్ట్ చైర్మన్ రాంచందర్‌రావు పాల్గొన్నారు.

నేడు నాటక ప్రదర్శన

జనతా సేవా సమితి సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో మన్యంకొండ కోనేరు సమీపంలో శనివారం సాయంత్రం భద్రాద్రి రామదాస చరితమ్ భక్తినాటక ప్రదర్శన నిర్వహించనున్నారు. వరకవుల నరహరిరాజు రచన, సంగీతం దర్శకత్వంలో ప్రదర్శన ఉంటుందని, నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

‘పల్స్‌పోలియో’కు సర్వంసిద్ధం


చిన్నచింతకుంటలో అవగాహన ర్యాలీ

నవాబుపేట: ఈ నెల 3 నుంచి నిర్వహించే పల్స్ పోలీయో కార్యక్రమానికి అన్ని సిద్ధం చేసినట్లు మండల వైద్యాధికారి నవీన్‌చంద్ర తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. మండలంలో మొత్తం 51 పోలీయో కేంద్రాలు ఏర్పాటు చేసి మొత్తం 8743 మంది చిన్నారులకు చుక్కల మందు వేసేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. మొత్తం మూడు రోజులు కార్యక్రమం ఉంటుందన్నారు.

చిన్నచింతకుంట: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి రాహుల్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో పోలీయో నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు.

బాధ్యతలు తీసుకున్న ఆనందరావు



పాలమూరు: నూతనంగా ఏర్పాటు అయిన న్యాయవాదుల పరస్పర సహకార సంఘం అధ్యక్షుడిగా ఆనందరావు శుక్రవారం కోర్టు ఆవరణలోని సంఘం భవన్‌లో బాధ్యతలు తీసుకున్నారు. ఇటీవల 11మంది డైరెక్టర్లకు జరిగిన ఎన్నికల్లో ఆనందరావు అత్యధిక ఓట్లు సాధించడంతో మిగిలిన డైరెక్టర్లు ఆయనను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా కాంతారెడ్డి, కోశాధికారిగా సతీష్ బాధ్యతలు తీసుకున్నారు. మాజీ అధ్యక్షుడు రవి ప్రకాష్, డైరెక్టర్లు చంద్రమౌళి, రోహిణి ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

నవాబుపేట: ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్యను మరింత పెంచాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం వివిధ గ్రామాల్లో ఆయన ఉపాధి పనులు పరిశీలించారు. వేసవి దృష్టిలో ఉంచుకుని కూలీలకు కావాల్సిన పనులు, సౌకర్యాలు కల్పించాలని ఆయన వివరించారు. ఏపీఓ జ్యోతీ, కార్యదర్శులు పాల్గొన్నారు.

న్యాచురోపతి శిబిరం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని సత్యనారాయణస్వామి ఆలయంలో శుక్రవారం సత్యేశ్వర ఆశ్రమం ఆధ్వర్యంలోఉచిత న్యాచురోపతి, ఆక్యుపంక్చర్ వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో హీలర్లు వేముల విజయలక్ష్మి, సుభాష్, వీణ, సబిత, శైలజ, ప్రసన్న, రుక్మిణి, హరిధర్, శ్రీకాంత్ తదితరులు చికిత్స అందించారు. శరీరం పంచభూతాలతో నిండినదని, వాటిలో ఏ తత్వం తక్కువైనా ఎక్కువైనా రోగాలు వస్తాయన్నారు. అందుకే వాటిని నాడిద్వారా పరీక్షించి సరిచేస్తే రోగాలు నయమవుతాయన్నారు. వైద్యంలో ఎలాంటి మందులు లేకుండా రోగాలు నయం చేయవచ్చన్నారు. శిబిరంలో 188మంది పరీక్షలు చేసుకుని అవసరమైన చికిత్స పొందారు. కార్యక్రమంలో సత్యేశ్వర ఆశ్రమం నిర్వాహకులు చిత్తనూరి ఈశ్వర్, రామకృష్ణ, నీలసంఘమేశ్వర్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

అనుమతి రద్దు చేయాలని వినతి


వినతి పత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మిడ్జిల్: అయ్యవారిపల్లి శివారులోని దుందుభీ వద్ద సీజ్ చేసిన ఇసుకను మహబూబ్‌నగర్ మెడికల్ కాలేజీ నిర్మాణానికి తరలించేందుకు ఇచ్చిన అనుమతి రద్దూ చేయాలని కోరుతూ శుక్రవారం ఎంపీపీ సుదర్శన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు తహసీల్దార్ రాజునాయక్‌కు వినతి పత్రం ఇచ్చారు. అనుమతుల పేరిట అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని ఆరోపించారు. నాయకులు బాలు, జగన్‌గౌడ్, గోపాల్, భీమ్‌రాజ్, సురేష్ కుమార్, రాములు, చరణ్, తదితరులు ఉన్నారు.

చట్ట సభలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

నవాబుపేట: చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్లు కలిప్పించాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ యుగంధర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆల్‌ఇండియా ఓబీసీ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కేశవరావుపల్లి పరిధిలోని మొరుగోనిపల్లిలో పండగ సాయన్న విగ్రహం నుంచి పాదయాత్ర ప్రారంభించారు. బీసీ రిజర్వేషన్లు ఒక్కతాటిపైకి వచ్చి పోరాటం చేయాలన్నారు. వరంగల్ జిల్లా ఖిలాషాపూర్ వరకు 360 కిలోమీటర్లు పాదయాత్ర ఉంటుందన్నారు. నాయకులు నరేందర్‌గౌడ్, బత్తుల సిద్ధేశ్వర్, సాయి నరేందర్, వినయ్ బాబు పాల్గొన్నారు.

ప్రతిభచాటిన ‘గాంధీరోడ్డు’ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సోహం అకాడమీ ఆఫ్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో గురువారం హైద్రాబాద్‌లోని శిల్పారామంలో రోబోటిక్స్ శిక్షణలో నైపుణ్యం పొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈమేరకు రాష్ట్ర వ్యాప్తంగా 17 జిల్లాల నుంచి 252 ఉన్నత పాఠశాలల విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా జిల్లా కేంద్రంలోని గాంధీరోడ్డు పాఠశాల విద్యార్థులకు మొదటి బహుమతి లభించింది. ఈమేరకు విద్యార్థులు /స్థానిక, ఆయేషాలను హెచ్ఎం జగదీశ్వరాచారీ తదితరులు శుక్రవారం అభినందించారు.


ఉపాధ్యాయులైన విద్యార్థులు

ఘనంగా స్వయంపాలన

అడ్డాకుల: తాటికొండ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డీఈఓగా తార, ఎంఈఓగా నందిని, హెచ్ఎంగా మేఘమాలతో పాటు మరికొందరు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థి ఉపాధ్యాయులు బహుమతులు గెలుచుకున్నారు. హెచ్ఎం అబ్దుల్ అజీజ్, ఉపాధ్యాయులు వెంకటయ్య, ఇందిరాదేవి, రమేష్, శివారెడ్డి తదితరులు ఉన్నారు.